ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

గురువారం 1 ఫిబ్రవరి 2024

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొండిచేయి

● నిరాశపర్చిన కేబినెట్ సమావేశం: యూటీఎఫ్

బెలగాం, జనవరి 31 : ఉద్యోగులు, టీచర్లకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని యూటీఎఫ్ నాయకుడు ఎస్.మురళీమోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్, పీఆర్సీ, 2003 డీఎస్సీ, ఓపీఎస్‌పై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైందన్నారు. ఈనెల 8న జరిగే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ అంశాలు లేకపోగా.. ఎన్నికల తర్వాతే వాటిపై ఓ నిర్ణయం తీసుకుంటారనేది తేలిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులు, టీచర్లు ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల వేళ.. లబ్ధిదారులకు వల

● సరికొత్త కార్యక్రమానికి సర్కారు శ్రీకారం ● రూపాయికే స్థలం రిజిస్ట్రేషన్ అంటూ వెల్లడి

● జిల్లాలోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే..

● చాలని ఆర్థిక సాయం.. అప్పుల ఊబిలో పట్టాదారులు

● నాలుగున్నరేళ్ల తర్వాత ప్రభుత్వ ప్రకటనపై గృహ నిర్మాణదారుల మండిపాటు

● ఓట్లకు గాలం వేయడమేనంటున్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నేతలు





పార్వతీపురం మండలం బాలగుడబలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

పార్వతీపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి)

'అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.. వైనాట్ 175 .. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ స్థానాల్లో వైసీపీ గెలుస్తుంది'.. ఇదీ తరచూ సీఎం జగన్ చెప్పే మాట. పథకాలు పొందే వారంతా తమ ఓటర్లు అంటూ చెప్పుకునే ముఖ్యమంత్రి ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరో కార్యక్రమానికి తెర తీశారు. పథకాలతో లబ్ధి పొందిన వారి ఓట్లుకు వల వేస్తున్నారు. తాజాగా రుపాయికే స్థలం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే సచివాలయాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించగా.. దీనిపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లన్నర వరకు గృహ నిర్మాణదారుల గోడును పట్టించుకోని వైసీపీ సర్కారు.. ఇప్పుడు హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజా వ్యతిరేకత తారస్థాయిలో ఉన్నందున పథకాలు పొందిన లబ్ధిదారుల ఓట్లు సైతం పడతాయో.. లేదోనన్న అపనమ్మకంతోనే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టిందనే వాదనలు లేకపోలేదు.

ఇదీ పరిస్థితి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీల పేరిట హడావుడి చేసింది. సామాన్యుడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు గొప్పలు చెప్పింది. ఈ మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు శివార్లలో, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో లే అవుట్లు ఏర్పాటు చేశారు. సెంటు, సెంటున్నర చొప్పున జిల్లాలో సుమారు 10 వేల పైబడి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. జగనన్న ఫొటోతో పట్టాలను సైతం అందించారు. అయితే గృహ నిర్మాణాలకు సంబంధించి కేంద్ర సర్కారు లబ్ధిదారులకు రూ.1,50,000 వేలు అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ రూపంలో రూ.30 వేలు మాత్రమే మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం సాయంతో కలుపుకుని మొత్తంగా తామే అందిస్తున్నట్లు వైసీపీ సర్కారు ఇంతకాలం చెప్పుకొచ్చింది. అయినప్పటికీ అనేకమంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు వెనకడుగు వేశారు. చాలీచాలని స్థలాల్లో ... అప్పులు చేసి ఇళ్ల నిర్మాణలు చేపట్టలేక చేతులెత్తేశారు. కాగా నిర్మాణాలు చేపట్టకుంటే .. పట్టా రద్దు చేస్తామని, స్థలాన్ని మరొకరికి కేటాయిస్తామని ఉన్నతాధికారులు బెదిరించడంతో.. కొంతమంది ముందుకొచ్చారు. కూలీలు, గృహ నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశన్నంటడంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.8 లక్షలు కూడా సరిపోని పరిస్థితి. దీంతో చాలామంది లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అతికొద్దిమంది మాత్రమే గృహ నిర్మాణాలు పూర్తిచేస్తే.. మరికొంతమంది మధ్యలోనే పనులను నిలిపేశారు. మరోవైపు లేఅవుట్లలో మౌలిక వసతుల కొరత కూడా తీవ్రంగా ఉంది. కాలువలు, రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలను నేటికి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇంటి నిర్మాణానికి అందిస్తున్న సాయం చాలడం లేదని, లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలుమార్లు లబ్ధిదారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ప్రయోజనం శూన్యం. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఆయా లబ్ధిదారులు కూడా వైసీపీ ప్రభుత్వానికి రివర్స్ అయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. వీరిని ఏదో ఒక విధంగా మచ్చిక చేసుకొనేందుకు సర్కారు కొత్త ప్రయత్నం ప్రారంభించింది. దీనిలో భాగంగానే రూపాయికే రిజిస్ట్రేషన్ అంటూ ప్రకటించింది. రిజిస్ట్రేషన్ పూర్తయిన పదేళ్ల తర్వాత ఆ స్థలాన్ని వేరొకరికి విక్రయించుకొనే హక్కు కలుగుతుందని ప్రభుత్వం వెల్లడిస్తుండగా.. లబ్ధిదారులకు వచ్చే లాభం ఏమీ ఉండదని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. పట్టాలు మంజూరు చేసిన తర్వాత స్థలాలపై సర్వ హక్కులు ఇళ్ల లబ్ధిదారులకు ఉంటుంది. వారి తదనంతరం వారి వారసులకు ఆ హక్కు ఉంటుంది. కొత్తగా వైసీపీ ప్రభుత్వం కల్పించే హక్కు ఏమిటో అర్థం కావడం లేదని , ఈ రిజిస్ట్రేషన్ పేరిట ప్రభుత్వం లబ్ధిదారుల ఓట్లకు గాలం వేస్తోందని ప్రతిపక్షాలు సైతం విమర్శలు గుప్పిస్తున్నాయి.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్ (ఫైల్)

సర్వర్ డౌన్..

జగనన్న లేఅవుట్లలో స్థలాలు మంజూరైన వారికి ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేపట్టే ప్రక్రియను ఇటీవల ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని సచివాలయాల్లో ఏర్పాట్లు చేశారు. అయితే సర్వర్ డౌన్ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వర్ సమస్య నేపథ్యంలో గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులతో పాటు వీఆర్‌వోలు, సిబ్బంది కుస్తీ పడుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. ఇటీవల కలెక్టర్ నిశాంత్‌కుమార్ కొన్ని సచివాలయాల్లో ఈ ప్రక్రియ జరిగే తీరును స్వయంగా పరిశీలించారు.

రిజిస్ట్రేషన్ ప్రారంభించాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జగనన్న లేఅవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాం. జిల్లాలో లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది.

- ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

లోకేష్ సభకు స్థల పరిశీలన

● 7న ఉల్లిభద్రలో పర్యటన ● ఏర్పాట్లలో నేతలు నిమగ్నం

గరుగుబిల్లి, జనవరి 31 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 7న కురుపాం నియోజకవర్గంలో పర్యటించనున్న దృష్ట్యా బుధవారం స్థల పరిశీలన చేశారు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, పలువురు టీడీపీ ప్రతినిధులు ఉల్లిభద్ర సమీపంలోని ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో పార్టీ అధినేత చంద్రబాబు పర్యటించిన ప్రాంతం.. బహిరంగ సభ నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు, నేతలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, డి.రామకృష్ణ, ఎంటీ విజయవాంకుశం, ఎం.సింహాచలంనాయుడు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.రాంబాబు, ఎల్.గోపాలం, పి.వెంకటనాయుడు, ఎ.రామకృష్ణ, ఎం.కృష్ణంనాయుడు, ఎం.పృథ్వీ, తదితరులు ఉన్నారు.



ఉల్లిభద్ర సమీపంలో స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నాయకులు

రహదారులను బాగుచేయలేరా?

● ప్రభుత్వాన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు

● రోడ్డుపై గుంతలో బైఠాయించి నిరసన

పార్వతీపురం టౌన్, జనవరి 31 : వాహదారులు, ప్రజల పాలిట యమపాశాలుగా మారిన అధ్వాన రహదారులను బాగు చేయలేరా? అని టీడీపీ నేతలు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై గుంతలో బైఠాయించి నిరసన తెలిపారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడిందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లాకేంద్రంలో ప్రధాన రహదారితో పాటు అంతరాష్ట్ర రోడ్డులో భారీ గుంతలు ఏర్పడడం వల్ల తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతుండగా, మరెంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇక వర్షం పడితే గుంతల మధ్య రోడ్డు ఎక్కడుందో వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కనీసం పాదచారులు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతుందోని వెల్లడిచారు. తక్షణమే వైసీపీ ప్రజాప్రతినిధులు స్పం దించి రోడ్ల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. టీడీపీ, జన సేన పార్టీలు అధికారంలోకి రాగానే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి తోపాటు పాతబస్టాండ్ మీదుగా వెళ్లే రాష్ట్రీయ రోడ్డును బాగు చేసి , ఎన్టీఆర్ మార్గ్ అని పేరు పెడతామని స్పష్టం చేశారు. ఈ నిరసనలో టీడీపీ నాయకులు బి.సీతారాం, ఎం.వెంకటేష్, జి.వెంకటనాయుడు, పి.సత్యనారాయణ, కె.మధు, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో పాతబస్టాండ్ కూడలి వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

ఉన్నతాధికారుల బదిలీ

● డీఆర్వో, పాలకొండ ఆర్డీవో తదితరులకు స్థానచలనం

పార్వతీపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుకు కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో రాజమహేంద్రవరంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఏబీవీఎస్ బి.శ్రీనివాసరావు నియామకమయ్యారు. కాగా తోటపల్లి బ్యారేజ్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న బి.సుదర్శన్‌రావుకు శ్రీకాకుళం బదిలీ అయింది. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ నియామకమయ్యారు. పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్యకు కూడా స్థానచలనం కల్పించారు. ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎస్‌డీసీగా పనిచేస్తున్న వి.వెంకటరమణను నియమించారు. ఎల్విన్‌పేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా డీఎస్ సునీత నియామకమయ్యారు. ఇప్పటివరకు పనిచేస్తున్న సీహెచ్ గౌతమికుమారికి విశాఖ బదిలీ అయింది.

జిల్లాకు కొత్త తహసీల్దార్లు

పార్వతీపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్త తహసీల్దార్లు రాబోతున్నారు. దీనికి సంబంధించిన బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బి.చిన్నికృష్ణ, విశాఖ జిల్లా నుంచి ఏ.వేణుగోపాల్, వి.సుజాత, ఎం.ఆనంద్‌కుమార్, కె.జయ, పి.శ్రీనివాసులు, హుకుంపేట నుంచి బి.రాజ్యలక్ష్మి తదితర తహసీల్దార్లు జిల్లాకు బదిలీపై వస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. కొత్త తహసీల్దార్లు జిల్లాకు వచ్చిన తర్వాత వారిని కలెక్టర్ నిశాంత్‌కుమార్ మండలాలకు కేటాయించనున్నారు. ఇదిలా ఉండగా జిల్లా నుంచి సుమారు 14 మంది తహసీల్దార్లు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు.

రోడ్డెక్కిన వీవోఏలు

● జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ

● కలెక్టరేట్ ఎదుట ధర్నా

బెలగాం, జనవరి 31 : వెలుగు వీవోఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు)లు రోడ్డెక్కారు. తమ సమస్యలపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని నినదించారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. రోజూ గ్రామాలకు వెళ్లి విధులు నిర్వహించే తమకు ఇన్సూరెన్స్ కల్పించాలని, ఆన్‌లైన్‌లో వర్క్ చేయడానికి వీలుగా ట్యాబ్స్ అందించి నెట్ బిల్లులు ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచి, వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలని నినాదాలు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు గండి శిరీష భారతి, సుహాసిని తదితరులు హెచ్చరించారు. అనంతరం డీఆర్వో వెంకటరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసనలో పార్వతీపురం, కొమరాడ, సీతానగరం, కురుపాం మండలాల యూనియన్ నాయకులు ఎం.స్వర్ణకుమారి, పి.వరలక్ష్మి, పి.పద్మ, సీఐటీయూ నేతలు వెంకటరమణ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

నేటి నుంచి సమ్మెలోకి..



● వెలుగు, డీఆర్‌డీఏ సిబ్బంది సన్నద్ధం ● సమస్యలపై సర్కారు స్పందించాలని డిమాండ్

పార్వతీపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెలుగు, డీఆర్‌డీఏ సిబ్బంది గురువారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నారు. తమ సమస్యలపై వైసీపీ ప్రభుత్వం స్పందించనందున తప్పనిసరి పరిస్థితుల్లో పోరుబాట పడుతున్నట్లు సంఘ నాయకులు స్పష్టం చేస్తున్నారు. సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిన్నమొన్నటి వరకు జిల్లాలో పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది సమ్మె చేసిన విషయం తెలిసిందే. పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారంతా నినదించారు. రోజూ వినూత్నంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయితే అందు లో కొన్ని శాఖల ఉద్యోగులపై ప్రభుత్వ సాను కూలంగా వ్యవహరించగా, మరికొందరిపై మొండి వైఖరిని ప్రదర్శించింది. మొత్తంగా ఆయా ఉద్యోగులు విధుల్లో చేరగా ఇప్పుడు వెలుగు, డీఆర్‌డీఏ సిబ్బంది రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారు. నేటి నుంచి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా బుధవారం వెలుగు, డీఆర్‌డీఏ సిబ్బంది జిల్లాకేంద్రం లోని వెలుగు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని సీఆర్పీలు, సీసీలు తదితరులు నినదించారు. ఏదేమైనా సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయా సిబ్బంది సమ్మెబాటలోకి వెళ్తుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.



వెలుగు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది

వారి డిమాండ్లు ఇవీ..

● సెర్ప్ ఆవిర్భావ సమయంలో నియమించిన 3,099 మంది ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేయాలి. ● ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఆర్‌పీఎస్‌ను అమలు చేయాలి. ● సెర్ప్ హెచ్‌ఆర్‌సీ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలి.

తప్పనిసరి పరిస్థితుల్లో..

తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్తున్నాం. మా సమస్యలపై వైసీపీ ప్రభుత్వం స్పందించాలి. ఏదేమైనా సర్కారు దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం.

- పి.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి, సెర్ప్ జేఏసీ, పార్వతీపురం మన్యం

స్పందించకపోవడం వల్లే..

మా సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించాం. సర్కారు స్పందించకపోవంతో సమ్మెలోకి వెళ్తున్నాం.

- ఎన్.రాజారావు, ట్రెజరర్, సెర్ప్ జేఏసీ

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

మా ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలి. ప్రధానమైన ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని సమ్మెబాట పడుతున్నాం.

- సతీష్, జేఏసీ కో-కన్వీనర్

ఏవోలకు అదనపు బాధ్యతలు

● ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా నియామకం

● ఆదేశాలు జారీ చేసిన జడ్పీ సీఈవో

గరుగుబిల్లి, జనవరి 31 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో 21 మంది ఎంపీడీవోలను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే వారి స్థానంలో ఆయా కార్యాలయాల ఏవోలకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం విజయనగరం జడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురానికి జి.జగదీష్ నాయుడు, మక్కువకు బీవీఎస్‌కే బద్రినాథ్, బలిజిపేటకు ఎ.భానుమూర్తి, గరుగుబిల్లికి ఎస్.అర్జునరావు, మెంటాడకు టీవీఎల్ పార్థసారథి ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా నియమించారు. విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలానికి పీవీ అమృత, డెంకాడకు కె.సరస్వతి, గుర్లకు ఏటీవీ ప్రసాద్, కొత్తవలసకు బి.నాగేంద్రప్రసాద్, నెల్లిమర్లకు జి.రామారావు, బొండపల్లికి డి.వెంకటరమణ, చీపురుపల్లికి టి.ప్రవీణ్‌కుమార్, దత్తిరాజేరుకు పి.శివాజీ, గజపతినగరానికి పి.సుదర్శనం, గరివిడికి జి.మధుసూదనరావు, జామికి వి.నరసింహం, తెర్లాంకు డీవీ అప్పారావు, భోగాపురానికి డి.బంగారమ్మ, రామభద్రపురానికి కె.అక్కారావు, ఎస్.కోటకు పి.శ్రీనివాసరావు, వేపాడకు జి.ఉమ (ఈవోపీఆర్‌డీ)ను నియమించారు. బదిలీ అయిన 21 మంది ఎంపీడీవోలు గురువారం శ్రీకాకుళం, విశాఖ జిల్లాల కలెక్టర్లు, జడ్పీ సీఈవోల ముందు హాజరుకావాల్సి ఉంది. వారంతా బుధవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు.

మద్యపాన నిషేధమేదీ?

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు



ప్రజలకు హామీ పత్రం చూపించి వివరిస్తున్న అదితి, టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, జనవరి 31: ప్రతిపక్షనేతగా ఊరూరా తిరిగి, మద్య నిషేధం చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి, అధికారం చేపట్టాక ఆ ఊసే త్తడం లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 28, 8 డివిజన్ల పరిధిలో నిర్వహించారు.ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ, మద్యనిషేధం జాడ లేకపోగా, రాష్ట్ర ప్రభుత్వం మద్యం అంశాన్ని వదలకుండా ఆ పేరు మీద కూడా 30 ఏళ్ల కాలపరమితితో అప్పులు వాడేసిందన్నారు. మద్యనిషేధం చెస్తానని చెప్పిన వ్యక్తి, మద్యంపై అప్పు చేయడం ఎంత దారుణమో ప్రజలు ఆలోచించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సారిక వెంకటరమణతో పాటు, నియోజకవర్గ నాయకులు, 28, 8 డివిజన్‌ల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

జామి: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరిస్తేనే రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని గజపతినగరం మాజీ శాసన సభ్యుడు కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. బుధవారం వెంకటరాజుపాలెం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తలి సూర్యారావు, చైతన్య, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన తప్ప అభివృద్ధి లేదు

● కోండ్రు మురళీమోహన్ ● టీడీపీలోకి భారీగా చేరికలు



రాజాం: పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: వైసీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం కరువైందని, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలన తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో గెడ్డవలస, అంతికాపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బూరాడ తిరుపతినాయుడు, పారంనాయుడు, రెడ్డి తవిటినాయుడు, బి.యుగంధర్, పి.మల్లిబాబు, రెడ్డి నారాయణరావు, పైల కృష్ణ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరంకుశత్వ వైఖరితో ప్రజలు పూర్తిగా విసుగుచెంdébదా రన్నారు. రూరల్ పార్టీ అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, గెడ్డవలస సర్పంచ్ కొయ్యాన జగదీష్, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, పొన్నాడ భీమేశ్వరరావు, రఘుమండల గణపతినాయుడు, జరజాన నీలయ్య, బూరాడ సింహాచలం, బూరాడ సతీష్, టంకాల సతీష్, రెడ్డి అప్పలనాయుడు, బంగారు నాయుడు, మాడుగుల జయరాం పాల్గొన్నారు.



బొబ్బిలి: పార్టీలో చేరినవారితో బేబీనాయన, తెంటు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రామభద్రపురం మండలం గొల్లలపేట పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం బొబ్బిలి కోటకు వచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. జోగిందరవలస, కర్రిందొరవలస, అప్పలరాజుపేట, గొల్లల పేట గ్రామాలకు చెందిన సుమారు 110 వైసీపీ కుటుంబాల వారు నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ గ్రామాలకుచెందిన వార్డు మెంబర్లు మునకాల చినబాబు, బాలి రామకృష్ణ, బోయి న పెంటయ్య, జన్ని రామారావు, కురిటి పెంటయ్య, బంటు శ్రీనివాసరావు, బొత్స సింహాచలం, అల్లాడ బంగారినాయుడు, జల్దిగంపల రామ్మూర్తి తదితరులు పార్టీ లో చేరినవారిలో ఉన్నారు. పార్టీ సీనియర్ నేతలు అల్లాడ భాస్కరరావు, కర్రోతు తిరుపతిరావు, మడక తిరుపతినాయుడు, కరణం భాస్కరరావు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గూడెపువలస పంచాయతీ పరిధిలో అల్లువానివలస, గూడెపువలస, రావివలస గ్రామాల నుంచి 50 కుటుంబాలు వైసీపీని వీడి బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు సమక్షంలో బుధవారం గూడెపువలసలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ ఎంపీటీసీ చల్ల సన్నమ్మ, ఆమె భర్త త్రినాథనాయుడు, చల్ల సత్యనారాయణను పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దీనికి ముందుగు మూడు గ్రామాల్లో వాడవాడల బేబీనాయన, తెంటులు ఊరేగుతూ బాణా సంచాకాల్చి, మేళతాళాలతో వెళ్లారు. పలువురు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. పూడి అప్పలనాయుడు, రావిపల్లి సత్యనారాయణ, అన్నాదేవుల విశ్వనాథరాజు, ఎచ్చెర్ల శ్రీనివాసరాజు, కొరువుపాటి పోలిరాజు, మండపేట శివరాజుతోపాటు పలువురు చేరిన వారిలో ఉన్నారు. తెంటు రవిబాబు, కొల్లి అప్పలనాయుడు, సింగిరెడ్డి భాస్కరరావు, బొంతు త్రినాథనాయుడు పాల్గొన్నారు. ● గూడెపువలస గ్రామంలో జయహో బీసీ సభను విజయనగరం జిల్లా పార్లమెంటరీ బీసీ సాధికారిత కొప్పలవెలమ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ ఇన్‌చార్జ్ బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తెంటు రవిబాబు, బొంతు త్రినాథనాయుడు, చల్లా తిరుపతినాయుడు, సింగిరెడ్డి భాస్కరరావు, పామోటి గోవిందరావు, మత్స త్రినాథనాయుడు, గొట్టాపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ వ్యవహారంపై విచారణ చేయాలి

● కోండ్రు మురళీమోహన్

రేగిడి: రేగిడి మండలానికి సరఫరా చేసిన సిమెంట్ వ్యవహారంపై విచారణ చేసి, వాస్తవాలు బయటపెట్టాలని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సోమరాజుపేటలో గల రేగిడి పీఆర్ ఏఈ రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సిమెంట్ వ్యవహారంపై అధికారులు, వైసీపీ నేతలు తీవ్ర ఒత్తిళ్లతో తన భర్తను మనసికక్షోభకు గురిచేసి, ప్రాణం తీశారని రామకృష్ణ భార్య ఉమ ఆరోపించారు.ఈ వ్యవహారంలో ఆయన్ను ఒక్కడినే బలి పశువు చేసి ఆడుకున్నారని, తాను పిల్లలతో ఉన్నానని, తనకు న్యాయం చేయా లని రోదించారు. మురళీమోహన్ మాట్లాడుతూ ఈఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఏఈ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకు ముందు ఆమదాలవలస, ఖండ్యాం గ్రామాల్లో టీడీపీ నాయకులకు చెందిన వ్యక్తులు మృతి చెందడంతో ఆయా కుటుంబాలను కోండ్రు పరామర్శించారు. టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారా యణరావు, కర్నేన మహేశ్వరరావు, పాలూరి రామినాయుడు, గేదల బాల మురళి, సర్పంచ్ బూడి ఆదినారాయణ, మజ్జి శ్రీనివాసరావు, గురువాన ధనంజయ్‌రావు ఉన్నారు.

బాలికావలసలో మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు

రేగిడి: మండలంలోని బాలికావలస పాఠశాల ఆవరణలో మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా బాలికావలస ప్రాథమిక పాఠశాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో తక్షణమే మరుగుదొడ్డి నిర్మా ణానికి స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టింది. ఈమేరకు ఎంఈవో వరప్రసాదరావు, సర్పంచ్ వి.చంద్రశేఖర్, హెచ్ఎం ఎస్.హైమావతి ఆధ్వర్యంలో గురు వారం మరుగుదొడ్డి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. దీని నిర్మాణానికి కలెక్టర్ రూ. 43వేలు కేటాయించగా, హెచ్ఎం హైమావతి రూ10వేలు, సర్పంచ్ చంద్ర శేఖర్ మరికొంతమంది విరాళాలతో రూ.83వేలు అంచనాతో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఈవో తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జి సొంత నిధులతో బోరు ఏర్పాటు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో బుధవారం ఉదయం కొత్తకోనేరు వద్ద సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బేబీనాయన సొంత నిధులతో బోరును రజకులకు బట్టలు ఉతికేందుకు అవసరం నిమిత్తం ఏర్పాటు చేశారు. రజకులు బట్టలు ఉతికేందుకు నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు, టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లగా బేబీనాయన చెప్పిన వెంటనే స్పందించి బోరు వేయించారు.

టీడీపీ వార్డులకు అన్యాయం జరుగుతోంది

● కౌన్సిల్ సమావేశంలో ఆ పార్టీ కౌన్సిలర్ల ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

బొబ్బిలి, జనవరి 31: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి. శరత్‌బాబు మాట్లాడారు. తాము గెలిచిన తరువాత ఇది మూడో బడ్జెట్ సమావేశమని, ఎటువంటి అభివృద్ధి పనులు చేసుకోలేకపోయామన్నారు. కోట్ల రూపాయల జనరల్ ఫండ్ నిధులన్నిటినీ వైసీపీ వార్డులకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, టీడీపీ వార్డులను అసలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అజెండాపై పూర్తి చర్చ ఉండదని, జీరో అవర్‌లో మాట్లాడదామని చెబుతూనే వెనువెంటనే వాయిదా వేసి పారిపోతారన్నారు. ప్రజాసమస్యలు అడిగితే ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. గ్రంథాలయం భవన సమస్యపై జనసేన నాయకుడు అల్టిమేటమ్ ఇచ్చి మరీ నిరాహార దీక్ష చేపట్టారని, దానిని పట్టించుకోకుండా టీడీపీ నాయకులపై ఛైర్మన్ లేనిపోని విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. 14 వ ఆర్థికసంఘం నిధులు తప్ప మరే అభివృద్ధి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. టీడీపీ కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కింతలి శ్రీదేవి, దాసరి రమేష్, కళ్యంపూడి లక్ష్మి, బొత్స అప్పలు తదితరులు మాట్లాడారు.

ఐటీడీఏలో చేర్చి పుణ్యం కట్టుకోండి సార్

● పార్వతీపురం పీవో విష్ణుచరణ్‌ను కోరిన చిట్టంపాడు గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

శృంగవరపుకోట రూరల్, జనవరి 31: గిరిశిఖర గ్రామం బొడ్డవర పంచాయతీ చిట్టంపాడులో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అక్కడి పరిస్థితులు, మరణాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలపై పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ స్పందించారు. బుధవారం ఉదయం ఆయన తన అనుచర గణంతో గిరిజన యువత ఆధ్వర్యంలో చిట్టంపాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 'సార్ మేం పేరుకే గిరిజనులం. మాకు ఐటీడీఏ పథకాలు అందడం లేదు. ఐటీడీఏ పార్వతీపురం వెళ్లిపోయాక వైద్య సేవలు చాలా భారంగా మారాయి. విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళితే మేం షె డ్యూల్ ఏరియా గిరిజనులం కాదని...మాకు అక్కడ ఏదీ ఉచితం కాదంటున్నారు. డబ్బులు ఖర్చు చేసి వైద్యం పొందడం తలకు మించిన భారంగా మారింది. రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల అనారోగ్యం పాలైతే డోలీయే దిక్కు. ఇటీవల కాలంలో ముగ్గురు చనిపోయారు. రోడ్డు నిర్మించండి. మాకు పోడు పట్టాలు ఇప్పించండి. సెల్‌టవర్లు వేయించండ'ంటూ తమ సమస్యలు ఏకరువు పెట్టారు. వీటిని సావధానంగా విన్న పీఓ మాట్లాడుతూ గిరిజన గ్రామాలను ఐటీడీఏలో కలపాలని గత ఏడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని... అవి ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. విశాఖ జిల్లా అటవీ ప్రాంతంలో ఈ గ్రామాలు ఉండడంతో పోడు పట్టాల విషయమై పాడేరు ఐటీడీఏ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. కొండ దిగువ భాగంలో గర్భిణులకు, బాలింతలకు వసతి గృహం ఏర్పాటు చేయాలని కొందరు కోరగా... పరిశీలిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు గౌరీష్, అప్పలరాజుదొర తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానం రద్దు చేయాలి

శృంగవరపుకోట: డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వి.రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం 6,100 ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని తీర్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. అప్రెంటిస్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. గత ఐదేళ్లుగా ప్రకటించకుండా ఎన్నికల ముందు ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపుతున్నారన్నారు. మెగా డీఎస్సీ అంటూ ఊరించిన ప్రభుత్వం తక్కువ పోస్టులతో నిరాశ పరిచిందని విచారం వ్యక్తం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు ఎం.వి.ఎ.నారాయణ, ఆశపు శ్రీనివాస్, జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న కోళ్ల



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కోళ్ల దంపతులు

లక్కవరపుకోట, జనవరి 31: మండలంలో ప్రసిద్ధి చెందిన నిడిగట్టు అంజన్నను ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దంపతులు దర్శించుకున్నారు. బుధవారం గనివాడ పంచాయతీ నిడిగట్టు గ్రామంలో గ్రామస్థులు తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు లలితకుమారి దంపతులు, పార్టీ నేతలు హాజరై ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను గ్రామ స్థులు నిర్వహించారు. టీడీపీ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్ పోటీ లను ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, రమేష్, జనసేన సమన్వయకర్త సత్యనారాయణ పాల్గొన్నారు.

జామిలో ఎలక్షన్ కమిషన్ డే ర్యాలీ



జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జామి, జనవరి 31: మండలం కేంద్రమైన జామిలో తహశీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలక్షన్ కమిషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రేంజ్‌లో 14 మంది సీఐల బదిలీ

● వేకెన్సీలో ఉన్న, పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పర్వం కొనసాగుతుంది. సీనియర్లతోపాటు తాజాగా సీఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రేంజ్ వేకెన్సీ రిజర్వ్‌లో ఉన్న సీఐలు సి.సూర్యానారాయణకు శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎక్స్)లో, అడబాల రవికుమార్‌కు విజయనగరం జిల్లా భోగాపురం యూపీఎస్‌లో, ఏవీ లీలా రావుకు విజయనగరం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సాలూరు రూరల్ సీఐ ఎస్.ధనుంజయ రావును అనకాపల్లి రూరల్ స్టేషన్ సీఐగా, పార్వతీపురం మన్యం జిల్లా కొటియా సీఐ బి.రోహిణిపతిని అదే జిల్లాలో స్పెషల్ బ్రాంచి (ఎక్స్)కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐ నమ్మి గణేష్‌ను అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విశాఖ రేంజ్‌కు పంపారు. తాజాగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం రేంజ్‌లో ఎదురుచూస్తున్న గేదెల బాల కృష్ణను పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు రూరల్ సీఐగా, కింతల నారాయణరావును కొటియా సీఐగా, ముదిలి శ్రీనివాసరావును విజయనగరం రూరల్ సీఐగా, డి. దీన బంధును అనకాపల్లి దిశ స్టేషన్ సీఐగా, టి.క్రాంతి కుమార్‌ను అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐగా, ఎస్.సన్యాసినాయుడు అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, బమ్మిడి అప్పలనాయుడును గూడెంకొత్తవీధి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అప్పలనాయుడు సేవలు మరవలేనివి

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి వీఆర్వో దాకారపు అప్పలనాయుడు సేవలు మరువలేనివని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి అన్నారు. బుధవారం అప్పలనాయుడు పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు దంపతులను తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సిబ్బంది సత్కరించారు.

రక్తదానం సామాజిక బాధ్యత

విజయనగరం రింగురోడ్డు: రక్తదానం సామాజిక బాధ్యతని యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నా వూరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుమ్మలూరి విశాలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి రాము, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెబ్ అదనపు ఎస్పీ వెంకటరావు బదిలీ

విజయనగరం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. విజయనగరం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ వెంకటరావును విశాఖపట్టణం సీటీ అడిషనల్ డీసీపీ ఎస్‌బీకి బదిలీ చేశారు.

గ్రంథాలయానికి కుర్చీలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖా గ్రంథాలయానికి బుధవారం కొత్తవలస పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చింతాడ వెంకట్ (నాని) నాలుగు వేలు రూపాయల విలువ చేసే రీడింగ్ ఛైర్స్, ఐదు రీడింగ్ ప్లాంక్స్‌ను బుధవారం అందించారు. ఈ కుర్చీలు పాఠకులకు బాగా ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి శ్రీధర్ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు అన్నారు. బూసాయవలసలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. ఒక్క ఛాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుదేశం శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చైతన్యవంతులను చేయాలని సూచించారు. దేశం అభ్యర్థి బేబీనాయన గెలుపు తథ్యమని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పాతబొబ్బిలిలో రక్తదాన శిబిరం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో మాతృభూమి సేవా సంఘం అధ్యక్షుడు పి.నాయుడు (పండు) ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, రాష్ట్ర లోక్‌సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బూర్లి పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల కుటుంబానికి పరామర్శ

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబాన్ని బుధ వారం వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. దివంగత అప్పలనాయుడు భార్య పైడితల్లమ్మ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. లలితకుమారి దంపతులను టీడీపీ నేత విజయనగరం పార్లమెంట్ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర కొప్పలవెలమ సంఘ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, సూరితాత, మేలాస్త్రీ అప్పారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన టూటౌన్ సీఐ



రామారావు

విజయనగరం క్రైం: విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్ సీఐగా కోరాడ రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు.. ఈయన విశాఖపట్టణం సిటీ త్రీ టౌన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన విజయనగరం వన్‌టౌన్‌లో గతంలో సమర్థంగా శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను జిల్లా కేంద్రంలో బాధ్యతలు చేపట్టానని, ప్రజల సహకారంతో శాంతిభ ద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

అతివేగానికి మూగజీవాలు బలి

● రైతుకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో విలపిస్తున్న రైతు కుటుంబ సభ్యులు

జామి, జనవరి 31: జామి-భీమసింగి మార్గంలో బుధవారం వేకువ జామున ఒక లారీ డ్రైవర్ అతివేగానికి రెండు ఎడ్లు మృతి చెందగా... బండిపై ఉన్న రైతు మూనురు ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామయ్యపాలెం గ్రామానికి చెందిన మూనురు ప్రసాద్ తన ఎడ్లబండిపై చెరుకును భీమసింగి సుగర్స్‌కు తరలిస్తున్నాడు. దొండపర్తి జంక్షన్ దాటి కొంచెం ముందుకు వెళ్లగానే వెనుక నుంచి ఒక బొగ్గు లారీ వచ్చి ఎడ్లబండిని వేగంగా ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే రెండు ఎద్దులు చనిపోగా... రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం ఐదు గంటల సమయంలో ఈ సంఘటన జరగడంతో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వారు వెంటనే 108కి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ అతివేగంతో పాటు ఉదయం మంచు ఎక్కువగా కురవడం కూడా ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. బాధితుడు ప్రసాద్‌కు ఆధారమైన బండి పూర్తిగా దెబ్బతినగా ఎద్దులు మరణించడంతో అతని కుటుంబ సభ్యుల రోదన కంటతడి పెట్టించింది. ● ప్రస్తుతం మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోంది. దీని కోసం విశాఖపట్నం నుంచి లారీలతో కొద్దినెలలుగా పెద్దఎత్తున బుగ్గిని తరలిస్తున్నారు. ఈ బుగ్గిని రవాణా చేసే మాఫియా అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు ప్లాంట్‌ల నుంచి పరిమితికి మించి తీసుకొస్తూ సొమ్ము చేసుకుంటోంది. ఈ వాహనాలు అతివేగంగా వెళ్తుండడం, వీటి వల్ల రోడ్లు దెబ్బ తింటున్నాయని, వీరిపై సంబంధిత శాఖ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గోవింద (ఫైల్)

లక్కవరపుకోట, జనవరి 31: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం చినగుడిపాల గ్రామానికి చెందిన భోజంకి గోవింద(51) తాటి చెట్ల కోతే వృత్తిగా జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తాటిచెట్టు కోయడానికి కల్లేపల్లి గ్రామం వెళ్లాడు. ఆ గ్రామంలో గోకేడవారి కళ్లాల వద్ద తాటి చెట్లను కోయడానికి సిద్ధమవుతూ తోటి పనివారితో కలిసి దారికి అడ్డంగా ఉన్న ముల్లులను తొలగిస్తుండగా భుజంపై ఉన్న ఇనుప నిచ్చెన పైనున్న విద్యుత్ వైర్లకు తగలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గోవింద స్పృహ కో ల్పోయి పడిపోవడంతో వెంటనే తోటి పనివారు చికిత్స నిమిత్తం ఎస్.కోట సామా జిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

కురుపాం రూరల్: కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ, గేదెలగూడ గ్రామానికి చెందిన ఆరిక రావియ్య(16) అనే బాలిక బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈమెను నీలకంఠాపురం ఆసుపత్రిలో చేర్చగా, ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సహాయం అందించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యా యత్నానికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

పాచిపెంట, జనవరి 31: అక్రమంగా తరలిస్తున్న 4 కేజీల గంజాయిని పట్టుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని సాలూరు సీఐ ధనంజయరావు తెలిపారు. మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురి వద్ద గంజాయిని పట్టుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జితేంద్రకుమార్, రహీరాజ్‌పుత్, బోలానాథ్ ఒడిశా ప్రాంతం జైపూర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలించేందుకు వెళుతున్నారని తెలిపారు. పాచిపెంట ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది తనిఖీ సమయంలో పట్టుబడ్డారని తెలిపారు.

రాజాం మునిసిపల్ కమిషనర్‌గా అప్పలనాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనాయుడు

రాజాం: రాజాం మునిసిపల్ కమిషనర్‌గా జె.అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ గుంటూరుకు బదిలీపై వెళ్ల డంతో ఆయన స్థానంలో పార్వతీపురం కమిషనర్‌గా పనిచేసిన అప్పలనా యు డును నియమించారు. అయితే పాత కమిషనర్ రెం డునెలలుగా సెలవులోనే ఉండడంతో మేనేజరు ఎంవీ నాగరాజు ఇంతవరకు ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహించారు. దీంతో మేనేజర్ నాగరాజు నుంచి చార్జీ తీసుకున్నారు.

పైపులైను లీకేజీ..



వృథాగా కాలువల్లో పోతున్న తాగునీరు

బొబ్బిలి, జనవరి 31: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర పాత రైల్వే గేటు సమీపంలో బుధవారం వేకువ జామున మున్సిపల్ తాగునీటి ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో పెద్దఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. ముందు రోజు రాత్రి నుంచి ఇలా నీరు పోతుండడంతో చుట్టుపక్కల గల ఖాళీ భూముల్లో నీరు చేరి చెరువులా కనిపిస్తోంది. రైల్వే ఆధ్వర్యంలో కొత్తగా కాలువల నిర్మాణ పనులు జరుగుతుండడంతో ము న్సిపల్ పైపులైను దెబ్బతింది. దీనితో భారీగా నీరు వృథాగా పోతోంది. సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించామని మున్సిపల్ డీఈఈ కనకరాజు తెలిపారు. రైల్వే పనులు జరుగుతుండడంతో పైపు లైను పాడైందని, నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు.

సీఆర్టీల రెగ్యులరైజేషన్ జాబితా సిద్ధం: డీడీ



ఒప్పంద ఉపాధ్యాయుల సర్వీస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సీతంపేట:సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఒప్పంద ఉపాధ్యాయుల(సీఆర్టీ) రెగ్యులరైజేషన్ అవసరమైన జాబితాను సిద్ధం చేశామని జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు అన్నదొర బుధ వారం తెలిపారు. 2014 జూన్ 2న సీఆర్టీలుగా విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు సర్వీస్ బ్రేక్ లేకుండా పనిచేసిన వారికి రెగ్యులరైజేషన్ చేయ డానికి అవసరమైన జాబితా రూపొందించాలని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు.ఈ మేరకు 254 మంది ఒప్పంద ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి వారంరోజులుగా ఒప్పంద ఉపాధ్యా యుల సర్వీస్ రికార్డులు, సర్టిఫికెట్లు కార్యాలయ పర్యవేక్ష కులు కె.దేశ్, హరిగోపాల, ముకుంద, కోటిబాబు పరిశీలిస్తున్నారు.

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు స్కూల్అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించ డానికి పీవో ఆదేశాలు మేరకు జాబితా సిద్ధంచేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అన్నదొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 77 మంది ఎస్జీటీలకు సంబంధించి పదోన్నతులు జాబితా సిద్ధంచేశామని పేర్కొన్నారు. వీరిలో 21 మందికి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించడానికి శుక్రవారం ఐటీడీఏ శంకరన్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వ హించనున్నట్లు తెలిపారు. అర్హతలు ఉన్నవారికి పదోన్నతికల్పిస్తామని పేర్కొన్నారు.

నత్తనడకన రహదారి విస్తరణ పనులు



పనులు నిలిచిపోవడంతో రహదారిపై సామగ్రి

వీరఘట్టం: వీరఘట్టం పరిధిలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 5.5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రెండేళ్ల కిందట పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా పనులు పూర్తికాకపోవడంతో గ్రామ స్థులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వం దలాది భారీ వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగడంతో దూళితో పిల్లలు, వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నా రు. రోడ్డు పనులకోసం తీసుకొచ్చిన రాళ్లను కుప్పలుగా వేసి నెరపకపోవ డంతో చోదకులు ఇబ్బందిపడుతున్నారు.కాగా వారంరోజుల్లో పనులు ప్రారంభిస్తామని రహదారులు, భవనాలశాఖ జేఈ జగన్మోహన్‌రాజు తెలిపారు.

'రహదారి పనులు ఎప్పట్లో పూర్తిచేస్తారు'

సీతంపేట: దోనుబాయి సచివాలయ పరిధిలో కుసుమూరు-దానుగుమ్మడ రహదారి మంజూరుచేసి నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకు రహదారి పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే వి.కళావతి ఇంజనీరింగ్ అధికారుల తీరుపట్ల అసంతృప్తిని వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దోనుబాయిసర్పంచ్ వెంకునాయుడు, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రహదారిపనుల్లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారి పనులు ఎప్పట్లో పూర్తిచేస్తారో తెలియజేయాలని ఇంజినీరింగ్ అధికారులు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో గుడ్లు సరఫరా జరగడం లేదని వైస్ ఎంపీపీ విజయలక్ష్మి తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో గీతాంజలి, ఈవోపీఆర్డీ సత్యం, డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణ్, ఎంఈవో ఆనందరావు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

● పార్వతీపురం డివిజన్ జీసీసీ డీఎం మహేంద్రకుమార్



మాట్లాడుతున్న మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: గిరిజనసహకార మార్కెటింగ్‌సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డీఆర్ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న సేల్స్‌మేన్లు, డీలర్లు సమయపాలన పాటించాలని పార్వతీపురం డివిజన్ జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్ కోరారు. మంగళవారం గుమ్మలక్ష్మీపుర బ్రాంచ్ కార్యాలయంలో సేల్స్‌మేన్లు,డీలర్లు, గ్యాస్, ఎంఎల్ఎస్ గోదాము, పెట్రోల్ బంకు ఇన్‌చార్జిలు, ఆఫీస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీసీసీ సిబ్బంది డిపోలో సమయపాలన పాటించి కార్డుదారులకు బియ్యం తదితర నిత్యావసర వస్తువులను అందజేయాలని కోరారు. నిత్యావసర సరుకులు అమ్మకాలు, అటవీ ఉత్పత్తుల (ఎంఫ్‌పి) సీజన్ దృష్టిలో ఉంచుకొని ఫలసాయాల కొనుగోలు గురించి చర్చించారు. కార్య క్రమంలో బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, గోదాము ఇన్‌చార్జి సాంబశివరావు, అకౌంటెంట్ గణపతిరావు పాల్గొన్నారు.

'జల'లో తాగునీటి ఎద్దడి



ఊటగెడ్డ నీటిని సేకరిస్తున్న గిరిజనులు

కొమరాడ: మండలంలో పెదశేఖ పంచాయతీ జల గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని గిరిజనులు తెలిపారు. గ్రామంలో ఉన్న మంచి నీటి ట్యాంకు మోటారు పాడవ్వడంతో కొద్ది రోజులుగా తాగునీరు రావడం లేదని, దీంతో సమీపంలో ఉన్న ఊటగెడ్డ నీరు తెచ్చుకొని తాగవలసిన పరిస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి తెలిపారు. తక్షణమే తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పాఠశాల వార్షిక క్రీడోత్సవాలు



క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న శంకరరావు

ఒడిశా

రాయగడ: స్థానిక కస్తూరి నగర్‌లో మదర్‌థెరిస్సా ఎడ్యుకేషనల్ ట్రస్టు పాఠశాల వార్షిక క్రీడోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ ఉత్సవాలను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు బి.శంకరరావు మంగళవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 250 మందికి పైగా పేదపిల్లలకు విద్యనందిస్తు న్నామని తెలిపారు. విజేతలకు వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ జయచంద్ర చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యనిర్వాహక కార్యదర్శి బి.సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయగడ కలెక్టర్‌గా మనోజ్‌సత్యవాన్ మహాజన్

రాయగడ: రాయగడ కలెక్టర్‌గా మనోజ్‌సత్యవాన్ మహాజన్ బుధవారం రామేశ్వర ప్రధాన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.



గరుగుబిల్లి: టీడీపీలోకి వైసీపీ నాయకులను ఆహ్వానిస్తున్న జగదీశ్వరి



పార్వతీపురం రూరల్: బాబు ష్యూరిటీ కరపత్రం అందజేస్తున్న విజయచంద్ర



సాలూరు: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● జిల్లా వ్యాప్తంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు.బుధవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అలాగే పలుచోట్ల నాయకులు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు.

● **పార్వతీపురం రూరల్:** రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని సుడిగాం పరిధిలో మూడడ్డవలస తదితర గ్రామాల్లో ం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనుదేవి చంద్రమౌళి, జి.చంద్రమౌళి, అరకు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

● **గరుగుబిల్లి:** తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. రావుపల్లిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన 150 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. బోను విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బోను సుగుణమ్మ, ఉప సర్పంచ్ గడిదేశి సత్యంతో పాటు పలువురికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తం నాయుడు, కె.భరత్ కుమార్, ఎం.తవిటినాయుడు, డొంకాడ రామకృష్ణ, ఎంబీ విజయవాంకుశం, పి.పూర్ణచంద్రరావు, ఎ.తవిటినాయుడు, ఎ.గంగాధర్‌నాయుడు, యడ్ల శ్రీనివాసరావు, ఎం.కృష్ణంనాయుడు, అన్నపూర్ణమ్మ, పాల్గొన్నారు.

● **గరుగుబిల్లి:** రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించక ముందే వైసీపీ ఓటమిని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. బుధవారం గరుగుబిల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి సామాజిక న్యాయం చేశామనడం ప్రజలను మోసగించడమేనన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి కల్పించిన ఏకైక ప్రభుత్వం అని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్రంలో అభివృద్ధి లేకుంటే ఓటు వేయ్యొద్దని ప్రకటిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంటున్న పరిస్థితిని చూసి స్వయంగా బొత్స అంగీకరించడంతో అర్థమవుతుందన్నారు. నాలుగున్నరేళ్ల సమయంలో సీతానగరం, పారాధి, పూర్ణపాడు-లాబేసు వంతెనలను పూర్తి చేయలేని దయనీయ స్థితిలో ఉందన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు గొంగాడ రామ్మూర్తినాయుడు, మరిశర్ల కార్తీక్, గుంట్రెడ్డి రవికుమార్ ఉన్నారు.

● **కురుపాం రూరల్:** తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరేష్‌దేవ్ కురుపాం మండలంలోని శింగుపురం, బియ్యాలవలస గ్రామాల్లో పర్యటించారు. తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలంటూ గిరిజనులను కోరారు. కాగా కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోగల వివిధ మండలాలకు చెందిన జనసైనికులతో టీడీపీ నాయకుడు వీరేష్‌దేవ్ బుధవారం కురుపాంలోని తన నివాసంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో అందరం కలిసి ఇరు పార్టీల బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. జన సైనికులు కడ్రక మల్లేశ్వరరావు, నేరేడుబిల్లి వంశీ పాల్గొన్నారు.

సాలూరు: 'మాలో ఎలాంటి గ్రూపులు లేవు... రానున్న ఎన్నికల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామ'ని టీడీపీ స్థానిక నాయకులు స్పష్టం చేశారు. సాలూరులోని సంధ్యారాణి నివాసంలో బుధవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి)తోపాటు పాచిపెంట, మక్కువ, మెంటాడ, సాలూరు మండలాల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, వేణు, వెంకటరమణ, ఆముదాల పరమేష్ స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి ఎలాంటి గ్రూపులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్యాం, గణపతి, బాలాజీ పాల్గొన్నారు.



గరుగుబిల్లి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్



కురుపాం రూరల్: వీరేష్‌దేవ్ నివాసంలో జనసేన నాయకులతో ఆత్మీయ కలయిక

డంపింగ్ యార్డుపై వాగ్వాదం

●సమస్యలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పట్టవా● నిలదీసిన టీడీపీ సభ్యులు

●అర్థాంతరంగా ముగిసిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు విషయంపై టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన సమస్యగాఉన్న డంపింగ్‌యార్డు విషయంపై కౌన్సిల్ సమావేశంలో టీడీపీ సభ్యులు గంటా సంతోష్‌కుమార్, పడాల రాంబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పట్టణంలోని సమస్యలు పట్టవా అని నిలదీశారు.నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ నెలవారి సమావేశంలో 20వార్డు ప్రతినిధి గంటాసంతోష్‌కుమార్ మాట్లాడుతూ నగరపంచాయతీ స్థలాలు కబ్జాలకు గురవుతున్నట్లు ఇటీవల వరుసగా సోషల్ మీడియాలో వస్తున్నాయని, దీనిపై ఏంచర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలకు చుట్టూ కంచె వేసి బోర్డు పెట్టాలని కోరారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీకి స్థలాలు ఎక్కువగా లేవని, గారమ్మకాలనీ, లుంబూరు కాలనీ స్థలాలు రెవెన్యూకు సంబంధించినవని, వాటిపై నగర పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోలేదని తెలిపారు.దీంతో సంతోష్‌కుమార్ స్పందిస్తూ నగర పంచాయతీవి కానప్పుడు వాటికి రోడ్లు, నీటి సరఫరాకు ఎందుకు ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డుపై సమాధానం చెప్పాలని కోరారు. ఈ విషయంపై వైసీపీ కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావు తదితరులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు తరలింపు కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ సమయంలో వైసీపీ కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, టీడీపీ సభ్యులు గం టా సంతోష్‌కుమార్ మధ్య వాగ్వాదం జరిగింది.

అధికార పార్టీ సభ్యుల మధ్య గలాట

అంతకుముందు అధికార పార్టీ సభ్యుల మధ్య గలాటా చోటు చేసు కుంది. లీజుకు ఇచ్చిన షాపును అనుమతి లేకుండా ఎలా కూలగొట్టారని కొంచాడ అరుణ్ కుమార్ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు స్పందిస్తున్న సమయంలో మరో అధికార పార్టీ సభ్యుడు తుమ్మగుంట శంకరరావు జోక్యంచేసుకుని అది తన వార్డు పరిధి అని, తాను అనుమతి కోరామని చెప్పే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. దీంతో కమిషనర్ శాంతింపజేశారు. కాగా డంపింగ్‌యార్డు విషయంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదనలు జరుగుతున్న సమయంలో వైస్ ఛైర్మన్ పల్లా ప్రతాప్ లేచి బయటకు వస్తున్న తరుణంలో కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు, ఛైర్‌పర్సన్, మిగిలిన సభ్యులు లేచి వెళ్లిపోయారు.

10న ప్రజ్ఞా వికాస పరీక్ష

బెలగాం: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి, భయాందోళనకు గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఈనెల 10న ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఈ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు కె.రాజు, టి.రమేష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. ఈ పరీక్ష రాయాలనుకునే వారు ఈనెల 7లోగా రూ.25 చెల్లించి పేర్లు నమోదు చేసుకుని హాల్ టికెట్ తీసుకోవాలని తెలిపారు. వివరాలకు 94405 65436, 76719 94813 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మక్కువ:డి.శిర్లం గ్రామ సమీపంలో ఉన్న సువర్ణముఖి నది నుంచి పార్వతీపురం మండలం పుట్టూరు, గంగాడ గ్రామాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్టు ఎస్ఐ పి.నర్సింహామూర్తి తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

సీతంపేట తహసీల్దార్ బదిలీ

సీతంపేట: సీతంపేట తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు బుధవారం వెలువడ్డాయి. సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా మూడేళ్లు పూర్తి చేసిన వారికి బదిలీ చేయాలని ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా అర్జునరావు

గరుగుబిల్లి: ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎన్.అర్జునరావును జడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ నియమించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయానికి ఆదేశాలు బుధవారం అందాయి. ఎంపీడీవోగా ఉన్న జి.పైడితల్లిని ఎన్నికల నిబంధనల మేరకు శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. ఆమె స్థానంలో ప్రస్తుతం కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తున్న అర్జునరావును నియమించారు.

సాలూరు సీఐగా బాలకృష్ణ

సాలూరు రూరల్: సాలూరు, కొఠియా సీఐలుగా గేదెల బాలకృష్ణ, కింతల నారాయణరావులు పదోన్నతిపై వచ్చారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో 14 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. సాలూరు సీఐగా పదోన్నతిపై గేదెల బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాలూరు సీఐగా పనిచేసిన ఎస్.ధనంజయరావు బదిలీపై అనకాపల్లి రూరల్ సీఐగా వెళ్లారు. అలాగే సాలూరు తహసీల్దార్ బాలమురళీకృష్ణకు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యింది.

కొరాపుట్ కలెక్టర్‌గా కీర్తి బాసన్

సాలూరు రూరల్: ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కలెక్టర్‌గా వి.కీర్తిబాసన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కొరాపుట్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన మహమ్మద్ అబ్బర్ అనుగుల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. గంజాం సీటీవోగా పనిచేసిన కీర్తి వాసన్‌కు పదోన్నతిపై కొరాపుట్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఒడిశాలో పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు చేశారు.

ఏడు నెలలైనా గౌరవ వేతనం ఇవ్వరా?

సాలూరు: ఏడు నెలలుగా గౌరవవేతనం ఇవ్వకపోవడంపై అధికార పార్టీకి చెందిన 29వ వార్డు కౌన్సిలర్ గొర్లె వెంకటరమణ ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు కమిషనర్ జయరాం తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆధ్వ ర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏడునెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో తాము కౌన్సిలర్లమా.. కాదా.. అనే సందేహం కలుగుతుందని, కౌన్సిలర్లుగా చెప్పకునే ఒకే ఒక్క అంశం కేవలం ఆ గౌరవ వేతనమేనని, కూడా ఏడు నెలలుగా ఇవ్వకపోతే ఎలా అని అధికార వైసీపీకి చెందిన వెంకటరమణ అధికారులను ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు 17 రోజులుగా చేసిన సమ్మె కాలంలో జీత భత్యాలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులు ప్రతినెల రూ.వెయ్యి అధనంగా సాధారణ నిధుల నుంచి ఇవ్వాలని,శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పట్టణంలోని 40 పోలింగ్‌స్టేషన్‌ల్లో మౌలికసదుపాయాలు సాధారణ నిధుల నుంచి రెండు లక్షల 60 వేలుకు ఖర్చుకు తీర్మానించారు. ఎన్నికల నిధులు మంజురైన తర్వాత వాటిలో నుంచి ఖర్చు చేసిన మొత్తాలను తీసేందుకు నిర్ణయించారు. మున్సిపాల్టీలో దోమలు విజృభిస్తున్నాయని మలాథియన్ ఫాగింగ్ చేయాలని వైస్ ఛైర్మన్ అప్పలనాయుడు ఆదేశించారు. కమిషనర్, ఛైర్‌పర్సన్ కారు అద్దెకు సంబంధించిన రెన్యువల్ అంశాన్ని కూడా సభ్యులు తీర్మానంలో ఆమోదించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ దీప్తి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన బోధన

బెలగాం/ గరుగుబిల్లి: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని పార్వతీపురం జూనియర్‌కళాశాల అధ్యాపక బృందం అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, ఉల్లిభద్ర, రావుపల్లి, కొత్తూరు జిల్లా పరిషత్ హైస్కూల్స్‌ను వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు ఏడుబృందాలుగా ఏర్పడి పదో తరగతి వి ద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటుకళాశాలల్లో అధిక ఫీజులు వసూళ్లతో పాటు తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉంటుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో సౌక ర్యాలను ఎంఈవో ఎన్.నాగభూషణరావుతో పాటు హెచ్‌ఎంలు వివరించారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు టి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుకన్య, శాంతి, ధనలక్ష్మి, లక్ష్మణరావు, హెచ్‌ఎంలు ఎస్.ప్రాత్రుడు, కె.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికి తీసేందుకే క్రీడా పోటీలు: జేసీ

బెలగాం: క్రీడాకారులల్లో దాగివున్న నైపుణ్యం వెలకితీయడానికే ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తోందని జేసీ ఆర్.గోవిందరావు అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన.. వివిధ ఆటల పోటీల్లో గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయికి చేరిన క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బి.గౌరీశ్వరి, డీఎంహెచ్‌వో జగన్నాథరావు, జిల్లా ప్రాధికార సంస్థ అధికారి ఓస్.వెంకటేశ్వరరావు, డీఈవో ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జల సంఘం సభ్యులకు శిక్షణ

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జలసంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు, సామాజిక పనులకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఓఈ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జియ్యమ్మవలస: వ్యాధులు ప్రబలకుండా గ్రా మాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి మహరా ణా అన్నారు. చంద్రశేఖర రాజ పురం గ్రామంలో చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో పారిశుధ్య పనులతో పాటు అంటువ్యాధులపై అవ గాహన కల్పించారు. ఎన్ఎస్ ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో పీవో సంజయ్ చావ్లా, అధ్యాపకులు డి.గౌరీశంకర్, వి.గౌరీశంకర్, నగేష్, సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎం శివ, వార్డు మెంబరు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

సీతానగరం: చినభోగిలలో రబీ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట నమోదు, పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో హేమలత బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న, అరటి పంటను నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఏవో ఎస్.అవినాష్, సిబ్బందికి సూచించారు. పెదభోగిల, కృష్ణరాయపురం, బూర్జ, వెంకటాపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణ, ఈఓపీఆర్డీ కేకేకే వర్మ పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన అవసరం

పార్వతీపురంటౌన్: రహదారి, అగ్ని ప్రమాదాల పట్ల వాహన చోదకులు అవగాహన కలిగిఉండాలని రీజినల్ రవాణా శాఖాధికారి సి.మల్లికార్జునరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోగల ఆర్టీవో కార్యాలయంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ప్రమాదాల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ డ్రైవర్లు మూడు నెలలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా అప్రమత్తం అవ్వాలో అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు వాహనచోదకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ రవాణా శాఖాధికారి శశికుమార్ పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగులు



మాదలంగి సమీపంలో మొక్కజొన్న పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలో మాదలంగి, వన్నాం గ్రామాల మధ్య బుధవారం గజరాజులు సంచరించాయి. దీంతో ఆయా గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. ఇప్పటికే ఏనుగులు ఆయా ప్రాంతాల్లో మొక్కజొన్న పంటను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొద్ది రోజులుగా వన్నాం, దళాయిపేట, మాదలంగి, పాలెం, తొడుము, తదితర ప్రాంతాల్లోని పంటల పొలాల్లో సంచరి స్తూ.. మొక్కజొన్న, అరటి, తదితర పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. వేలాది రూపాయలు మదుపులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నా రు.

శంబర మారు జాతర ఆదాయం రూ.25.59 లక్షలు



అమ్మవారి ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

మక్కువ: శంబర పోలమాంబ మారు జాతర ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కించారు. కానుకలు, నగదును వేరు చేశారు. మొత్తంగా రెండో వారానికి సంబంధించి భక్తుల నుంచి రూ. 25,59,843 వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వేలు చేపట్టండి: డీఎంవో

కొమరాడ: రెబ్బ, వనధార గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు చేపట్టి.. నివేదికలు అందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. 'జ్వరంతో చిన్నారి మృతి' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం రెబ్బ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అక్కడ నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన రక్త పరీక్షలు, వాటి నివేదికలను పరిశీలించారు. వారికి తగు మందులు అందజేసి , రోజు పర్యవేక్షించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన మందులు, పరీక్షలుగ్రామంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. జ్వరాలను గుర్తించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజనులతో మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన దోమల ప్రభావిత ప్రదేశాలను పరిశీలించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట పారిశుధ్య పనులు చేయించాలని పంచాయతీ సెక్రటరీ, సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ఈ పరిశీలనలో డాక్టర్ బి.శామ్యూల్, ఏఎంవో సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, సీహెచ్‌వో బంగారుబాబు పాల్గొన్నారు.



రెబ్బలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంవో

కులగణన సర్వే పరిశీలన

సీతానగరం: పెదబోగిల గ్రామ పంచాయతీలో కుల గణన సర్వేను ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ కులగణన చేయాలన్నారు. ఈ సర్వే శుక్రవారంలోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేకేకే వర్మ, ఈవో వెంకటరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు మరిచిపోలేం

బెలగాం: పోలీసు శాఖలో 35 ఏళ్లగా అంకితభావంతో పనిచేసిన ఉద్యోగుల సేవలను ఎప్పటికీ మరిచిపోలేమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం పదవీ విరమణ చేసిన డీపీఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, గరుగుబిల్లి ఏఎస్ఐ ఎన్.శంకరరావులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సత్కరించారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ప్రారంభం

కురుపాం రూరల్:కురుపాం, కిచ్చాడ, బియ్యాలవలసల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యువమోర్చా అధ్యక్షుడిగా అప్పలనాయుడు

పాలకొండ: పాలకొండ పట్టణ బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడిగా ఉదయాన అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టంకాల దుర్గారావు, పట్టణాధ్యక్షుడు ధనుంజయరావు అప్పలనాయుడును అభినందించారు.